## క్లుప్తంగా

### ఆలయ నిర్మాణానికి నిధులు



పాణింగపల్లి గ్రామస్తులకు చెక్కును అందిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

**కె.గంగవరం:** మండల పరిధిలోని కూళ్ల, పాణింగపల్లి గ్రామాల్లో నూతన కోదండ రామాలయాల నిర్మాణానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ చెక్కును అందించారు. పాణింగపల్లిలో ఆలయానికి నిర్మాణానికి రూ.10 లక్షల మంజూరు కాగా మొదటి విడతగా రూ.3.30లక్షల చెక్కును గ్రామస్తులు చీకట్ల గోపాలం, సొసైటీ అధ్యక్షుడు అచ్యుతరామయ్య ప్రసాద్ తదితరలకు అందించారు. ఆలయాల నిర్మాణానికి శ్రద్ధ వహించి నిధులు మంజూరు చేసిన మంత్రి చెల్లుబోయిన వేణుకు ఆయా గ్రామ పెద్దలు, ప్రజలు అభినందనలు తెలిపారు.

### శివభగవాన్‌కు పరామర్శ



శివను పరామర్శిస్తున్న పట్టాభిరామయ్య చౌదరి తదితరులు

**మండపేట:** రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు సాధనాల శివ భగవాన్‌ను బుధవారం పార్టీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి పరామర్శించారు. శివను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, పార్టీ నాయకులు సూరంపూడి సత్యప్రసాద్, కొప్పిరెడ్డి కృష్ణ, సిరంగు శ్రీను, గణేష్ తదితరులు పరామర్శించారు.

### నేడు పాఠశాలలకు సామగ్రి పంపిణీ

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉదయం 11 గంటలకు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించిన వంట పాత్రలు, లైబ్రరీ బుక్స్, టాయిలెట్ క్లీనింగ్ కిట్లు పంపిణీ చేయనున్నట్టు ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

### అభయాంజనేయ స్వామికి పూజలు, హోమాలు



స్వామికి పూజలు చేస్తున్న పండితులు

**రాయవరం:** వెదురుపాక సావరం తుల్య భాగ నది ఒడ్డున ఉన్న అభయాంజనేయస్వామి వారి 17వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆలయంలో అభిషేకాలు, పూజలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నౌడు ధనసత్తిబాబు, సుజాత దంపతులు హోమాలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

### రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో ఉపాధ్యాయులు

**కపిలేశ్వరపురం:** తిరుపతిలో గురువారం నుంచి 12వ తేదీ వరకూ నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. బాలురు విభాగంలో కె.వినయ్‌కుమార్, కె.సతీష్‌కుమార్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో సుందరపల్లి సంధ్య, నీతిపూడి లక్ష్మీప్రియ, మాతా కావేరి ఎంపికయ్యారు. వారిని పాఠశాల హెచ్‌ఎం వంగా శ్రీనివాస్, పీడీ గుబ్బల వేణుగోపాలరావు, పీఈటీ వాసంశెట్టి రవికుమార్ అభినందించారు.

### 13న మండల సమావేశం

**కపిలేశ్వరపురం:** మండల సర్వసభ్య సమావేశంలో ఈ నెల 13న స్థానిక మండల పరిషత్ సమావేశంలో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన జరగనున్న సమావేశంలో అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆదేశించినట్టు ఎంపీడీఓ తెలిపారు.

# సర్వేజన.. ఆరోగ్య రక్షణ..

- పల్లెలకు చేరిన వైద్యులు
- పేదల ఇంటి ముంగిట పరీక్షలు
- రెండు నియోజకవర్గాల్లో ముగిసిన ఆరోగ్య సురక్ష శిబిరాలు
- వైద్యసేవలు కొనసాగించాలనే నిర్ణయంపై ప్రజల హర్షం



అంగర సురక్ష వైద్య శిబిరంలో ఈసీజీ పరీక్ష చేస్తున్న సిబ్బంది (ఫైల్)

**కపిలేశ్వరపురం:** రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైద్యులు పల్లెలకు చేరి సేవలందించారు. పేదల ఇంటి ముంగిట్లో వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్య సమస్య తీవ్రతను విశ్లేషించి జగనన్న ఆరోగ్య శిబిరానికి తరలించి ఆధునిక యంత్రాలతో వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీలో ఉచితంగా శస్త్ర చికిత్స చేసేందుకు నిర్ణయించారు. ఇదంతా జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో నెల రోజుల్లో చకచకా జరిగిపోయాయి. ఇలా పేదల ఇంటికి వైద్య నిపుణులు వచ్చి పరీక్షించడాన్ని గతంలో ఎన్నడూ చూడలేదంటూ పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక నుంచి ఈ వైద్య సేవలు కొనసాగుతాయంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విజయవంతంగా ముగిసిన ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణా తీరుపై ఈ కథనం...

**రెండు నియోజకవర్గాల్లో ఇలా**

మండపేట నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 21,497 మందికి సాధారణ వైద్యసేవలందించారు. 5,513 మందికి కంటి పరీక్షలు చేశారు. 207 మందికి ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలు చేయించాలని నిర్ణయించారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో 14,381 మందికి సాధారణ వైద్యసేవలందించారు. 4,156 మందికి కంటి పరీక్షలు చేయగా 125 మందికి ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలు చేయించాలని నిర్ణయించారు.

**వైద్యసేవలందించిన తీరు సంతోషదాయకం**

ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి నెల రోజులు ముందు నుంచి క్షేత్ర స్థాయిలోని వైద్య ఆరోగ్య కార్యకర్తలు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలను ఆరా తీశారు. వ్యక్తి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుని రక్తపోటు, షుగర్, యూరిన్, హిమోగ్లోబిన్, మలేరియా, డెంగీ, కఫం పరీక్షలు చేసి వివరాలను ప్రత్యేక యాప్‌లో అప్లోడ్ చేశారు. మెరుగైన పరీక్షలు అవసరమని నిర్ధారించుకున్నవారిని గ్రామాల్లో నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరాలకు తరలించి పరీక్షించారు. ఈ మొత్తం ప్రక్రియలో వైద్య ఆరోగ్య సిబ్బంది అంతా సామాన్య జనం వెన్నంటి నడిచారు. ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను విజయవంతం చేశారు.

| మండలం | సాధారణ సేవలు | కంటి సేవలు | వైఎస్సార్ ఆరోగ్యశ్రీ |
|---|---|---|---|
| ఆర్సీపురం అర్బన్ | 7,221 | 2,268 | 29 |
| కె.గంగవరం | 7,160 | 1,888 | 96 |
| మండపేట | 6,603 | 1,823 | 65 |
| రాయవరం | 6,891 | 1,717 | 34 |
| కపిలేశ్వరపురం | 8,003 | 1,973 | 108 |
| మొత్తం | 35,878 | 9,669 | 332 |

**సిబ్బంది కృషి అమోఘం**



రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో నిర్వహించిన వైద్య శిబిరాలు విజయవంతమయ్యాయి. వైద్య ఆరోగ్య, ఇతర ప్రభుత్వ శాఖల గ్రామ స్థాయి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేశారు. సామాన్య ప్రజలకు ఎంతగానో ఉపకరించాయి. అన్ని విభాగాల నిపుణులు శిబిరాల్లో సేవలందించడంతో ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రత్యేకత.

– ఎం.రామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ, కపిలేశ్వరపురం

**పేదల ఆరోగ్యానికి భరోసా**



జగనన్న వైద్య ఆరోగ్య సురక్ష శిబిరాలు సామాన్య ప్రజలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. షెడ్యూలు ప్రకారం బీపీ, షుగరు, కళ్ళ పరీక్షలు చేయడంతో వారి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసుకునే వీలు కలిగింది. అవసరమైన వారికి మెరుగైన పరీక్షలు చేయడంతో కాస్త ఉపశమనం పొందారు.

డాక్టర్ జీవీ గీతాంజలి, వైద్యురాలు, అంగర పీహెచ్‌సీ, కపిలేశ్వరపురం మండలం

### నేటి నుంచి 'పల్లెకు పోదాం'

**రాయవరం:** ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం నుంచి మండలంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరవుతారన్నారు. ఈ నెల 9న మాచవరం సచివాలయం-2, 10న మాచవరం సచివాలయం-1, 14న లొల్ల సచివాలయం, 15న కూర్మాపురం సచివాలయం, 16న కురకాళ్లపల్లి సచివాలయం, 17న చెల్లూరు సచివాలయం-3, 20న చెల్లూరు సచివాలయం-2, 21న చెల్లూరు సచివాలయం-1, 22న వి.సావరం సచివాలయం, 23న వెదురుపాక సచివాలయంలో సమావేశాలు నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి నాలుగు గంటల వరకూ జరుగుతాయని, సంక్షేమ పథకాలు, ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే.. అనే అంశాలపై చర్చిస్తామన్నారు.

### పుంతరోడ్ల అభివృద్ధికి వినతి

**మండపేట:** అర్తమూరులో పుంతరోడ్లు అభివృద్ధి చేయాలని కోరుతూ బుధవారం అధికారులకు వినతిపత్రం అందజేసినట్టు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు చెప్పారు. గ్రామంలోని గొల్లాలమ్మ పుంత రోడ్డు, హైలెవల్ కాలువగట్టు పుంత, చినద్వారపూడి, పాలమూరు, పెడపర్తి తదితర గ్రామాలకు వెళ్లే పుంత రోడ్లు అధ్వానంగా తయారవ్వడంతో పంట ఉత్పత్తులు తరలించుకునేందుకు రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. సమస్యను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందిస్తూ పుంత రోడ్లు అభివృద్ధికి మండల సమావేశంలో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారన్నారు. ఈ మేరకు తమ గ్రామంలోని పుంత రోడ్లు అభివృద్ధి చేయాలని ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, మండల అధికారులకు వినతి పత్రాలు అందజేసినట్టు పాపారాయుడు తెలిపారు.

## రైతులకు అధిక ప్రాధాన్యం

మార్కెట్ కమిటీ పాలకవర్గానికి మంత్రి వేణు సూచన



మంత్రి వేణును సత్కరిస్తున్న ద్రాక్షారామ మార్కెట్ కమిటీ పాలకవర్గం, సిబ్బంది

**రామచంద్రపురం రూరల్:** నియోజకవర్గంలోని రైతులకు మేలు చేసేలా పదవీ కాలంలో కృషి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సూచించారు. ద్రాక్షారామ మార్కెట్ కమిటీ తొలి సమావేశంలో మంత్రి వేణు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నూతన కమిటీ తమను పరిచయం చేసుకున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, వైస్ చైర్మన్ పేరూరి సోమరాజు(కాకతీయ రాజు), డైరెక్టర్లు గాడా లావణ్య, సూరంపూడి కన్న, జుత్తుక రామలక్ష్మి, సుందరపల్లి వెంకటేశ్వరావు, రూకాత్ ఫాతిమా, జంగుం వీరవెంకటసత్యసూర్యప్రకాశరావు, మల్లిడి వెంకటరమణ, కేశనకుర్తి దేవి, సిద్దాని పద్మావతి, ములకల సుజాత, యాళ్ల విజయదుర్గ, వీత్తనాల గంగరాజు, కొప్పెర్ల వెంకట నరసింహరాజు, కొత్తపల్లి అరుణ ఈ కార్యక్రమంలో మాట్లాడారు. చిన్న కులాలకు చెందిన తమకు మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా అవకాశం కల్పించి సాధికారత ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి వేణుకి కృతజ్ఞతలు తెలిపారు. రూ. 8 లక్షలతో రామచంద్రపురం పట్టణంలో రైతు బజార్ నిర్మాణం పూర్తి చేసినందుకు అభినందనలు తెలిపారు. మార్కెట్ కమిటీ ఆదాయం పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రి వేణు సూచించారు. మార్కెట్ కమిటీ గోదాముల మరమ్మతులు, సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు చేయాలని తెలిపారు. పాలక వర్గం, సిబ్బంది మంత్రి వేణును దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి పి.వాసుదేవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యా సంస్థల బంద్ విజయవంతం



ద్రాక్షారామలో బంద్‌లో పాల్గొన్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

**మండపేట:** విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మండపేటలో తలపెట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని సంఘ నాయకుడు రవికుమార్ తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను నిరసిస్తూ కార్మికులు చేపట్టిన దీక్ష నేటికి వెయ్యి రోజులకు చేరుకుందన్నారు. వారికి మద్దతు తెలియజేస్తూ విద్యార్థి సంఘాలు బంద్ పాటించాయన్నారు. కలువపువ్వు సెంటర్‌లో విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. విద్యార్థి సంఘాల నాయకులు వెంకట్, వెన్నెల, సాయికుమార్, సతీశ్, భాను ప్రసాద్, శ్యామ్ బాబు, సందీప్, సుహాస్, గణేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్**

**రామచంద్రపురం/రామచంద్రపురం రూరల్:** పట్టణ, గ్రామాల్లో విద్యా సంస్థలను బంద్ విజయవంతమైంది. నాయకులు వెంటపల్లి భీమశంకరం, చింతా రాజారెడ్డి, కర్రి గణేష్, కూర్మా దాసు, సాహిల్, అంబటి కృష్ణ తదతరులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు నిర్వహిస్తున్న ఉద్యమం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా బంద్ విజయవంతం చేశారు. కార్యక్రమంలో పద్మ, యేసు, పిల్లి వీర బాబు, గౌతమ్, సందీప్, విజయతేజ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



కుయ్యేరులో మొక్కలు నాటుతున్న సర్పంచ్ కృష్ణమూర్తి



సత్యవాడలో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**కాజులూరు:** 'స్వచ్ఛత మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా బుధవారం కుయ్యేరు గ్రామ పరిశుభ్రతను చేపట్టారు. గ్రామంలో వీధుల్లో చెత్త తొలగించి, డ్రైన్లను శుభ్రం చేశారు. ట్యాంకర్ల ద్వారా హైపోక్లోరైడ్ ద్రావనాన్ని తెచ్చి పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, శుభ్రత లేని వాతావరణమే అంటువ్యాధులకు కారణమన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు, ఉపాధి హామీ పథకం కూలీలు పిచ్చిమొక్కలను తొలగించగా పలు చోట్ల నాయకులు, అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీటీసి చీకట్ల సత్యనారాయణ, నాగభూషనం, పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

**కె.గంగవరం:** పరిసరాల పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని, అందుకు గ్రామాల పరిశుభ్రతలో ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. సత్యవాడ గ్రామంలో బుధవారం స్వచ్ఛత.. మనందరి బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. తొలుత ప్రజాప్రతినిధులు, పారిశుధ్య కార్మికులతో కలసి ఆమె ఆయా గ్రామాల్లో పారిశుధ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాగమణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను భద్రపరిచి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. కురగాయలు, ఇతర వ్యర్థాలు ఇంటి పెరట్లో గొయ్యి తీసి దాని వేయాలన్నారు. తద్వారా వచ్చే ఎరువులను వినియోగించుకోవాలన్నారు. ఇళ్ల మధ్య మొక్కలు నాటాలన్నారు. సర్పంచ్ సలాది సూర్య కళావతి, గ్రామ కన్వీనర్లు సలాది అర్జున రావు, దేవపాటి రాంబాబు, నీతిపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**సచ్ఛత–మన బాధ్యత నినాదాలతో ర్యాలీ**

**రామచంద్రపురం రూరల్:** హసన్‌బాదలో బుధవారం స్వచ్ఛత–మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ వజ్రపు బాబీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలు, పారిశుధ్య కార్మికుల సహకారంతో రోడ్లపై నుంచి చెత్తను తొలగించారు. అనంతరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో ర్యాలీ చేసి మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, ఉప సర్పంచ్ నీలం భవాని, పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్య సుబ్రహ్మణ్యం, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ, రెవెన్యూ, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ద్వారపూడిలో 'గడప గడపకూ'



స్థానికులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్సీ తోట

**మండపేట:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్సీ తోట ద్వారపూడిలో పర్యటించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ తులా శ్రీరంగారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు దంతులూరి శ్రీరామవర్మ తదితురులతో కలిసి పంతంగి వారి రామాలయం తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు చెప్పిన సమస్యలపై ఎంపీడీఓ ఐ.రాజు, పంచాయతీ అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా సీఎం జగన్ ప్రజల వద్దకే పథకాలను చేరవేస్తూ పారదర్శకమైన పాలన సాగిస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని, ముడుపులు చెల్లిస్తేనే కాని పథకాలు అందని దుస్థితి ఉండేదన్నారు. సీఎం జగన్ వచ్చాక ఎటువంటి అవినీతికి తావులేకుండా వలంటీర్లు తలుపుతట్టి ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నారని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. పార్టీ నాయకులు సంగిశెట్టి రమేష్, యరగతపు విజయ్, పోతుల దుర్గాప్రసాద్, పాలినాటి సత్యనారాయణ, సత్తి రాంబాబు, దండుబోయిన సూర్యనారాయణమూర్తి, నామాల వెంకన్న, నామాల శ్రీనివాసరావు, తొంటాపు సత్తిపండు, పుట్టపూడి సత్తిబాబు, గొరినాయుడు, గూడూరి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

## బాణసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

ఆర్డీఓ సుధా సాగర్



గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌ను పరిశీలించి వ్యాపారులకు సూచనలు చేస్తున్న అధికారులు

**రామచంద్రపురం:** డివిజన్ పరిధిలో బాణసంచా విక్రయ వ్యాపారులు నిబంధనల తప్పనిసరిగా పాటించాలని కోవాలని ఆర్డీఓ ఎస్.సుధాసాగర్ బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. దీపావళికి తాత్కాలిక బాణసంచా విక్రయ లైసెన్స్ కోసం రూ.500 సీఎఫ్ఎంఎస్ ద్వారా చలానా రూపంలో చెల్లించాలన్నారు. దీనితో పాటు 18 శాతం జీఎస్టీ రుసుం చెల్లించాలన్నారు. దరఖాస్తుతో పాటు అనుమతులకు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రంలోగా అందజేయాలన్నారు. తహసీల్దార్ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ సూచించిన ప్రదేశాల్లో మాత్రమే నియమ, నిబంధనలు అనుసరించి విక్రయాలు చేపట్టాలని తెలిపారు. లైసెన్స్‌ను ఇతరులకు బదలాయించినా వారిపై ప్రేలుడు పదార్థాల చట్టం అనుసరించి చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

**బాణసంచా దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన**

**కాజులూరు:** బాణసంచా దుకాణాల ఏర్పాటు చేసే స్థలాలను తహసీల్దారు సాయిసత్యనారాయణ, గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎం.తులసీరామ్ బుధవారం పరిశీలించారు. పలు గ్రామాల్లో వారు పర్యటించి దుకాణాల ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలించి, వ్యాపారులకు తగు సూచనలు చేశారు. అనుమతులు లేకుండా బాణసంచా విక్రయించినా, నిబంధనలు అతిక్రమించినా, సరుకు నిల్వలు ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపారులు అమ్మకాల సమయంలోనూ ప్రతి దుకాణం ముందు 500 లీటర్ల నీరు, ఒక బకెటు ఇసుక సిద్ధంగా ఉంచుకోవాలని, దుకాణాలకు మధ్య మూడు మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలన్నారు. మంటలను అదుపు చేసే డీసీపీ కెమికల్ పౌడర్ ఒక సిలెండర్ ఉండాలని, దుకాణాల వద్ద ఎక్కువ బాణసంచా ఉంచకుండా ఎప్పటికప్పుడు తరలించుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వీఆర్వో ఈశ్వర్రావు, కాకినాడ లేబర్ ఆఫీస్, ఫైర్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్సీ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ సిరిపురపు, చిత్రంలో ఎంపీపీ శ్రీనివాస్

**మండపేట:** మండపేట నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఎనలేని కృషి చేస్తున్నారని ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఏఎంసీ చైర్మన్ సిరిపురపు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత మండలంలో వివిధ శాఖల ప్రగతి గురించి అధికారులు వివరించారు. ఏఓ కె.ఏసుబాబు మాట్లాడుతూ కోతలు మొదలయ్యాయని, రైతుల నుంచి ధాన్యం సేకరించేందుకు మండలంలో 18 కొనుగోలు కేంద్రాలు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం పూర్తి పారదర్శకంగా కొనుగోళ్లు జరగాలన్నారు. జెడ్ మేడపాడు ఎంపీటీసీ సభ్యుడు దేవు ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ గోనె సంచులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీపీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు మాట్లాడుతూ రైతులకు ఎక్కడ ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్దిష్టమైన ఆదేశాలిచ్చారన్నారు. ఏ గ్రామంలోని ధాన్యాన్ని అదే గ్రామంలోని రైస్‌మిల్లులకు తరలించాలని ఎమ్మెల్సీ తోట సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి ఆ దిశగా చర్యలు తీసుకున్నారన్నారు. ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం మాట్లాడుతూ గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వివిధ శాఖలకు సంబంధించి తమ గ్రామాల్లోని సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, ఎంపీడీఓ ఐ.రాజులకు ఎంపీపీ శ్రీనివాస్ సూచించారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ సిరిపురపు మాట్లాడుతూ గత పాలకులకు సాధ్యం కాని నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం ఎమ్మెల్సీ తోట చేసి చూపించారన్నారు. పట్టణంలో రెండో డంపింగ్‌యార్డుకు స్థలసేకరణ, ద్వారపూడి రోడ్డు తదితర అభివృద్ధి పనులే నిదర్శనమన్నారు. ఈ అభివృద్ధి ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఆర్‌బీకే మండల కమిటీ చైర్మన్ అన్నందేలు చంద్రరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

### రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు

**కొత్తపేట:** ప్రస్తుత ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయాలని ఆర్డీవో ఎం.ముక్కంటి సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం సాయంత్రం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో ముక్కంటి ఖరీఫ్–2023 సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలుపై రెవెన్యూ, సివిల్ సప్‌లైస్, వ్యవసాయ అధికారులు, వీఆర్‌ఓలు, వీఏఏలు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి అవగాహన కల్పించారు. గ్రామాల్లో ధాన్యం తరలించేందుకు వాహనాలు, జట్టు కూలీలు సమకూర్చడం వంటి అంశాలపై చర్చించారు. ఆర్డీవో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సంచులు అందుబాటులో ఉంటాయన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు వాహనాలు సమకూర్చామన్నారు. ఆ ధాన్యాన్ని లోకల్ ఏరియాల్లో రైస్ మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. రైతులకు ఏ విధమైన సందేహాలు లేకుండా ఈ విషయాలన్నీ వారికి వివరించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు, ఏవో పద్మలత, ఎంఎస్‌ఓ టీవీఎస్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

### కిడ్నీ వ్యాధి బాధితుడికి ఆర్థిక సాయం

**రావులపాలెం:** కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు బుధవారం రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ముమ్మిడివరం మండలం దొమ్మేటి వారిపాలేనికి చెందిన పెనుమత్స శ్రీనివాసరాజు రెండు కిడ్నీలు పాడైపోయి, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని డాక్టర్లు చెప్పారు. ఆయనకు తల్లి కిడ్నీ దానం చేస్తున్నారు. ఆపరేషన్‌కి రూ.10 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో అంత ఆర్థిక స్తోమత లేని వారు స్థానిక కాశీ అన్నపూర్ణ సేవా సంస్థను సహాయాన్ని కోరారు. దీంతో సేవా సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.20 వేల ఆర్థిక సాయాన్ని శ్రీనివాస రాజుకి అందజేశారు.

## యువత గొడవలకు దూరంగా ఉండాలి



కాజులూరులోమాట్లాడుతున్న కాకినాడ ఎస్పీ సతీష్‌కుమార్

**కాజులూరు:** గ్రామాల్లో తలెత్తే చిన్న, చిన్న గొడవలు, అసాంఘిక కార్యకలాపాలకు యువత దూరంగా ఉండాలని కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం రాత్రి కాజులూరు శివారు ఏజీకేపేటలో పోలీసులు యువతకు, స్థానిక మహిళా పోలీసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దండంగి సరోజిని అధ్యక్షతన జరిగిన సభలో ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ యువత వ్యసనాలకు బానిసై కేసుల్లో ఇరుక్కుని ఉద్యోగాలకు దూరమవ్వటమే కాకుండా ప్రతి ఎన్నికల సమయాల్లోనూ బైండోవర్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. ఎన్నికల నియమావళిపైనా మహిళా పోలీసులు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించుకుని మసలుకోవాలన్నారు. కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాసు, గొల్లపాలెం ఎస్సై ఎస్ తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.